(ఇంజనీర్లు) వచ్చి సానుభూతి చెప్పారు. సర్కారువారినుంచి కాంపెన్సేషన్ (నష్టపరిహారం) వస్తుందన్నారు.

ఆ రాత్రి ఎవరికీ నిద్దర్లులేవు కాలనీలో - మర్నాడు కొండ వాళ్ళు వచ్చి దొరల కాళ్ళమీదపడి గట్టిగా పట్టుకుని కదలనివ్వలేదు. రాధమ్మను గవర్మెంటు చంపేసింది అంటారు వాళ్ళు. ఆఫీసులన్నీ కొండ వాళ్ళు దాడి చేస్తారేమోననే భయంతో మూసేశారు. దొరలకి ఈ చిక్కులోంచి బయటపడ్డం ఎలాగో తెలియలేదు. రైల్వే కంట్రాక్టర్ల పన్లన్నీ ఆగిపోయాయి.

అప్పుడొక డాక్‌రన్నరు మరియు ప్యూన్ దొరలకు ధైర్యం చెప్పి సైకిలుమీద వెళ్ళి ఆ ఊరి హెడ్ కానిస్టేబుల్ని పిలుచుకొచ్చారు. హెడ్‌కానిస్టేబులు కొండవాళ్ళతో మాట్లాడి ఈ క్రింది నిర్ణయాలు తెలియజేశాడు.

రాధమ్మకి సిమెంటుతో తులసికోట కట్టి మంచి సమాధి కట్టించాలి. రాధమ్మ శవాన్ని దొర్లంతా మోయాలి. పూలతో రాధమ్మ శవాన్ని అలంకరించాలి. కొండవాళ్లకి తాగుడు ఖర్చులక్రింద వంద రూపాయలు ఇవ్వాలి. శవానికి భజన ఖర్చుల క్రింద ముప్పయి యివ్వాలి. కొండవాళ్ళకి రాధమ్మ దినవారాల ఖర్చులంతా దొరలే భరించాలి.

అన్నిటికీ దొరలు చకచకా ఒప్పేసుగున్నారు. పెళ్లికాని చక్కని బుడ్డిగ రాధమ్మ శవం ఆఫీసువేపు తలపెట్టి వూరివేపు కాళ్ళు పెట్టి దొరల భుజాలమీద లేచి ఏటిఒడ్డుకు వెళ్ళింది. మెళ్ళో బంతిపూల దండలు మందార మాల వేసుకుని తాగి భజనచేస్తూ ఆమె ప్రియుడు శవం ముందు నృత్యం చేశాడు.

బుడ్డిగ రాధమ్మ కళాసీగా నెల జీతం మీద పనిలో చేరక ముందు మా ఇంట్లో పనిచేసేది. నేనే మా వారికి చెప్పి రాధమ్మకా ఉద్యోగం వేయించాను.

# అసమర్థుల జీవితయాత్ర

మనలో చాలా మంది పెద్ద కష్టాలకు అలవాటు పడి తట్టుకున్నట్టు చిన్న చిన్న ఇబ్బందులకు నిలబడి తట్టుకోలేరు. పెద్ద కష్టం ఏదైనా వచ్చి మీదపడినపుడు నార్మల్ లైఫ్ స్తంభించిపోతుంది, "అయ్యో పాపం అలాగా" అంటూ అంతా సానుభూతికో, సహాయానికో వస్తారు. చిన్న ఇబ్బందులు పైకి చెప్పుకోవటానికి వీలుండదు. జీవితపు రోటీన్ను చిందర వందర చేసి పారేసే శక్తి చిన్నవాటికే ఎక్కువ. టన్ను రాయి వచ్చి మీదపడితే మనం అసలు మిగలక పోవచ్చు - అదే కంట్లో నలక పడితే టన్ను రాయి వచ్చిపడిన దానికంటె అనేక టన్నుల చిరాకూ హైరాణా పడిపోతాం. లైఫ్ ఈజ్ లైక్ దట్! వెధవ ప్రాణం సుఖానికి ఓర్చుకోలేదు, కష్టానికి ఓర్చుకోలేదు. ఎండకూ నిలబడలేదు. వానకూ తట్టుకోలేదు. ఆనందాన్ని సహించలేదు, విషాదాన్ని భరించలేదు.

కమింగ్ టు ది సబ్జెక్ట్ – అందరిళ్ళ సంగతి నాకు తెలీదు కాని మా ఇంట్లో ఏ వస్తువూ సమయానికి కనిపించదు. ఒకవేళ కొండ తవ్వినంత ప్రయత్నం చేసినా తీరా అది దొరికేసరికి వుపయోగకరంగా వుండదు. అది అంతే –

అగ్గిపెట్టెలో పుల్లలుండవు. పావలా కావలసొచ్చినప్పుడు పది రూపాయల నోటుకి చిల్లరుండదు. వీధిలోకొస్తే మైలున్నర వాకింగ్ చేస్తే కాని రిక్షా కనపడదు. వెళ్ళక వెళ్ళక సినిమాకెళ్తే స్తంభం వెనకాల సీట్లో కూర్చోవాలిసొస్తుంది. రెండు రూపాయల నోటు మారిస్తే అందులో ఓ చిరిగిన నోటు – ధర్మామీటరు డొక్కు కనిపిస్తుంది కాని అందులో ధర్మామీటరుండదు – ధర్మాప్లాస్కు బిరడా కనపడదు లేదా దాని లోపలి గ్లాసు పవరు తగ్గేనా వుంటుంది. క్రింద ముచిక విరిగిపోయేనా వుంటుంది. డిప్షనరీలో మనకు కావలసిన పేజీలు చిరిగిపోయుంటాయి. మనకు కావలసిన పుస్తకం ఎవరో అరువట్టి కెళ్లి వుంటారు, మొగం చూసుకునే చిన్నద్దం ఎప్పుడూ బ్రద్దలయ్యే వుంటుంది. మధ్యకు రెండుగా చీలి, బాత్రూంలో పంపు స్క్రూ లూజయి రాత్రింబగళ్ళు సీరియల్ నవల్లా కారుతూ వుంటుంది. సబ్బిళ్ళ నిండా ఇసక, పత్రికలకూ పుస్తకాలకూ అట్టలుండవు. మంచం ఎప్పుడూ గొయ్యిలానే వుంటుంది. పరుపు ముళ్ళ పరుపులానూ, తలగడ దిండు వధ్య శిలలాను వుంటుంది. దీపం కళ్ళమీదే ప్రకాశిస్తుంది. ఫ్యాను గాలి ఎప్పుడూ ప్రక్కకే వీస్తుంది. చెప్పుల జోడు వర్షంలోనే నడి రోడ్డులో టప్పుమని తెగిపోతుంది. సీసాలకు మూతలుండవు. గాజు గ్లాసులు అచ్చిరావు, కప్పులకు సాసర్లుండవు. చేతి రుమాళ్ళకు అక్కవుంటుండదు అవి కనపడని దేవుళ్ళు. రేడియో వాల్యూము హెచ్చదూ తగ్గదూ – ముల్లు ఒకే స్టేషన్లో బిగిసిపోతుంది. బయటి మెట్ల దగ్గర బల్బు ఎప్పుడూ మాడిపోతోంది. రెండో చెప్పు యెంత వెతికినా కనపడదు. అలారం టైంపీసు టైమూ చూపదు, అల్లారమూ కొట్టదు. ట్రంకు పెట్టెలకి అడుగుండదూ తాళాలుంటాయి కాని చెవులుండవు. కిటికీ రెక్కలు తెరుచుకుంటాయి కాని మూసుకోవు. మధ్యాహ్నం వచ్చిన ఉత్తరాలు మళ్ళీ చూద్దామంటే కనపడవు. పళ్ళపొడి డబ్బాలో ముగ్గూ–తెల్ల సున్నం, అందరివీ ఒకేరంగు టూత్ బ్రష్లు, నాలిగ్గీసుకొనేవీ అంతే. పైజమ్మాలు బొందులు లోపలికి వెళ్ళిపోయి వుంటాయి. పంట్లాములకు గుండీలు కరువు. కాగితాలకు పిన్నులు కరువు ఇలా చెప్పుకొంటూపోతే ఇన్నన్నీ కావు బాబు ఇంటిబ్బందుల్ – ఇలా ఎందుకుంటుందీ అంటే చెప్పలేం– ఇది అసమర్థుల జీవయాత్ర గనుక.

ఉన్నవి పారేసుకోడం లేదా పాడుచేసుకోవడం అవే మళ్ళీ మళ్ళీ కొనుక్కుంటూ వుండటం – రేడియోవాడు చెప్పినట్టు రికరింగ్, రికరింగ్, రికరింగ్, అవే–అవే–అవే–మళ్ళీ మళ్ళీ కొనడం పారేసుకోడం కొనడం – నిజంగాచాలా విసుగ్గా వుంటుంది. గొడుగులు, చేతి రుమాళ్ళు, బెల్టులూ, దువ్వెనలూ, ఫ్లాస్కులూ ఒకటేమిటి జీవితావసర వస్తువులన్నీ మళ్ళీ మళ్ళీ వెర్రివాళ్ళల్లా కొంటూ వుండటం డామ్‌టీడియస్‌గా వుంటుంది. ఏ వస్తువు కొన్నా అది మా యింట్లో క్రిందపడి బద్దలయిపోతుంది. లేదా పాడైపోతుంది. సరదాపడి ఏదైనా బొమ్మపటం

కట్టిచ్చామనుకోండి – అద్దమైనా పగులుంది. ఫ్రేమైనా వూడిపోతుంది. టీపాయికొంటె దాని కోడేనా విరుగుతుంది. మీది బల్లైనా వూడొస్తుంది. లేదా పైగ్లాసు ముక్కలవుతుంది. నిరంతరం మా ఇంట్లో ఏదో దౌర్జన్యం హింసాకాండ జరిగి పోతున్నట్లు వస్తువులన్నీ పాడయిపోతూ వుంటాయి. అంచేత – ఏదైనా కొందామని గాని సరదాగా తెచ్చి అలంకరిద్దామని గాని వుండదు – కారణం, "మనింట్లో ఏవీ తిన్నగా వుండవు – ఎందుకు పోనిస్తూ కొత్త దుఃఖం" అంటారు మావారు.

ఉన్నవి పోతూంటే ఒక రకం ఏడుపు, కొత్తవి అవిలేవు ఇవిలేవు అని మరో రకం ఏడుపు. ఇన్ని ఏడుపులు ఎక్కడ ఏడుస్తాం. జీవితం ఇలా గుందేమని ఏడుపు అట్లా లేదేమని ఏడుపు – కొత్త వస్తువు ఏద్దైనా వస్తే అది పాడయి తీరుతుంది కదా – అందుకు మరో ఏడుపు – ఇన్ని దుఃఖాల మధ్య బతుకు బండిని లాగడం చాలా చాలా కష్టం.

అంచేత మేం సెన్సాఫ్ హ్యూమర్ని అడ్డంవేసుకుని నవ్వటం నేర్చుగున్నాం. ఏడవాల్సిన చోట లోపల్నే ఏడ్చి పైకి నవ్వుతూ తిరగెయ్యటం, మనింట్లో డిసిప్లిన్ లేదు. డిసిప్లిన్ లేదు అని అప్పుడప్పుడు మావారు గొడవపెడుతూ వుంటారు. మనమంతా పల్లెటూళ్ళ నుంచి పట్నాలకు పాకి వచ్చిన వారమే కదా – పై పొరగీకితే లోపల్నుంచి "రస్టిక్స్" బయట పడతారు. ఆంధ్రాస్ ఆర్ రస్టిక్స్ ఎసెన్సియల్లీ ఇందుకేమీ మినహాయింపు ల్లేవు. పారిశ్రామిక నాగరికత వచ్చి మీదపడితేనే కాని ఈ క్రమశిక్షణా రాహిత్యం, పోతే పోయిందిలే ఏం చేస్తాం వున్నదేదో వుంది లేందిలేదు అనే తత్వం పారిపోదు.

జీతాలెక్కువ వస్తున్నాయి. ఇంట్లో కూడా ప్లేయర్సు ఎక్కువయారు. చదువులూ చట్టుబండలూ, తిండీ గుడ్డా గుడుసూ ఖర్చులెక్కువయాయి, షోకులు సరదాలు ఎక్కువయ్యాయి. కుటుంబ పరిస్థితులు మారాయి. నెలపొడుగూతా కాపర్సు కోసం తడువుకోవడమే – దిగజారి పోతున్నామా– ఎదుగుతున్నామా తెలీటం లేదు.

జీవితం చాలా అర్గనైజుడుగా వుండాలి. ఆలోచించి ప్రతి ఖర్చూ చేయాలి. వేస్ట్ నథింగ్. ఆడంబరాలు తగ్గించుకోవాలి. పొదుపుచేయాలి. ఇవన్నీ ఎవడికి తెలీవు? ఎందుకని చేయలేకపోతున్నాం – ఏదైనా అయిపోయిందంటే భయమే – బ్రతుకంటే భయం పట్టుకుంది. కర్మా థియరీతో సరిపెట్టుకుందా వంటే మన అప్రయోజకత్వం బయటపడుతుందే వోననే బెంగ–ఆర్థికంగా, మానసికంగా, నైతికంగా హీనదశకు చేరుకుంటున్నా వేమోనని భయంవేస్తోంది. గంగా కూలంకష పెక్కు భంగులు వివేకభ్రష్ట సంపాతముల్ అన్నారు కదా! మధ్య తరగతి పడిపోతున్నదంటే స్తంభాలు పడిపోతున్నాయన్న మాట. స్తంభాలు పడటం ఆరంభమయాక గోపురం కూలకుండా వుంటుందా? అంతవరకూ అసమర్థుల జీవయాత్ర బితుకు బితుగ్గా భయం భయంగా సాగవలసిందే – సాగుతూ వుంటుంది.